# నిగ్రహానుగ్రహాలు

### మధురాంతకం రాజారాం

నిలుచున్న పాటున ఒకసారి వచ్చి తనని కలుసుకోవలసిందని రాఘవేంద్రంగారి దగ్గిరనుంచి కబురు వచ్చింది. ఉలికిపడ్డాడు శేఖరం. తనేం పొరబాటు చేశాడు? ఏదో చేసివుంటాడు! చేసివుండకపోతే రాఘవేంద్రం గారు కబురు పంపరు.

శేఖరం చరచరా యింట్లోకి వెళ్లాడు. "ఏమేవ్" అని పద్మని పిలిచాడు. "ఎందుకో గానీ రాఘవేంద్రంగారు కబురు పంపించారు వచ్చి కలుసుకోమని" అంటూ తన ముఖం ఆ వార్త వినగానే ఎలా మారిందో తెలుసుకోడానికి అద్దంముందు నిలుచున్నాడు.

"అదేమిటండీ! క్షణంలో అలా అయిపోయారు! ఆ రాఘవేంద్రంగారు కొట్టి కొఱికివేస్తారేమిటి! ఐనా మీరిప్పుడేం చేశారనీ?" అంటూ విస్తుపోయింది పద్మ.

"ఏమిటో, ఏంపాడో" అంటూ పైగుడ్డ విదిలించి భుజంపైన వేసుకుని శేఖరం వీధిలో పడ్డాడు.

ఇనుప కమ్మల గేటును మెల్లగా తోసుకుని కోటలా వున్న రాఘవేంద్రంగారి కాంపౌండులో ప్రవేశించాడు శేఖరం. ఓ వైపున వరుసగా నిలిచిన రెండెద్దుల బళ్లు, మరోవైపున కొండలా పోసివున్న వేరుశెనగ పొట్టు మధ్యనించీ అతడు తిన్నగా కచేరీ చావడి సమీపించాడు. రాఘవేంద్రంగారి తాతగారు ఓ జమీని ఇరవై ఏళ్ళపాటు తాకట్టుంచుకున్న సందర్భంలో ఆ కట్టడానికి కచేరీ చావడని పేరొచ్చింది. జమీ పోయినా ఆ పేరుమాత్రం స్థిరంగా నిలిచిపోయింది. ఇప్పటికీ అయిదారుగురు గుమాస్తాలక్కడ నిర్విరామంగా పనిచేస్తుంటారు.

చావడి దాటుకుంటే ఓ చిన్న వుద్యానవనం చూపరులకు దృగ్గోచర మౌతుంది. రాఘవేంద్రంగారి కుమారుల్లో ఒకతను అమెరికా వెళ్లి వ్యవసాయ శాస్త్రంలో డిగ్రీలు పొంది వచ్చాడు. ఈ పూలతోట అతడి పర్యవేక్షణలో పెరుగుతుంది. తోటకు మధ్యగా పదడుగుల వెడల్పుతో చావడినుంచీ రాఘవేంద్రంగారి ఏకాంత భవనం వరకూ ఒక పూలపందిరి వెదురు తడికలపైన అల్లుకుని వుంది. మనసుతో పాటు వాతావరణం కూడా ఆహ్లాదకరంగా వున్నప్పుడు, రాఘవేంద్రంగారు ఆ పందిరి క్రింద పచారు చేస్తుంటారు. కానీ ఆయన అలా ఆహ్లాదంగా వుండడమనేది జన్మకంతా శివరాత్రిలా సంవత్సరానికి ఏ ఒకటి రెండు సార్లో జరిగే సంగతి. ఆయన ముఖంలో సర్వసాధారణంగా చిరాకు చిందులు త్రొక్కుతుంటుంది. తనకు తానుగా ఆయన ఎవరికైనా కబురు పంపిస్తే తప్ప పిలవని పేరంటంగా ఆయన్ను కలుసుకోడానికి సాహసించే వాళ్లు అరుదు. తరచుగా ఆయన కోసం పెద్ద పెద్ద వుద్యోగులు వస్తుంటారు. వచ్చిన వాళ్లు బంగళాలో విడిదిచేసి ఆయన కబురుకోసం ఎదురు చూస్తారు. ఆ కబురు వాళ్లవాళ్ల అదృష్టంకొద్దీ, వేళావిశేషం కొద్దీ ఎప్పుడో ఒకప్పుడు వస్తే రావచ్చు. లేదా, రాకపోవచ్చు. అలా కబురు రానిపక్షంలో అక్కడ వేచివుండి లాభంలేదని పెద్ద వుద్యోగులు తమ కోపాన్ని క్రింది వుద్యోగుల పైన చూపించడానికి వీలుగా, హుటాహుటిగా తమ స్వస్థానాలకు వెళ్లిపోతారు.

రాఘవేంద్రంగారి ఏకాంత గృహంలో మూడు గదులున్నాయి. కుడివైపు గది ఎప్పుడూ తాళం వేసి వుంటుంది. అందులో ముఖ్యమైన రికార్డులు, ఇనప్పెట్టెలు వున్నాయని చెప్పుకుంటారు. ఎడమవైపు గదికి మూడు కిటికీలు, రెండు వెంటిలేటర్లూ వున్నాయి. గాలీ, వెలుతురు ఎంతకావాలంటే అంత రాఘవేంద్రంగారి యిష్టప్రకారం ఆ గదిలో ప్రవేశిస్తాయి. రేబవళ్లలో రమారమి ముప్పాతికా మువ్వీసం వంతు రాఘవేంద్రంగారు ఆ గదిలో పట్టె మంచంపైన పాలసముద్రంలో వటపత్రశాయిలా పవ్వళిస్తారు. ఆయనకు గుండె దడవుందని లోకంలో ప్రతీతి. ఉన్నదో లేదో ఆ గది గోడపైన పెద్దసైజులో విలసిల్లుతున్న వేంకటేశ్వరుడికి తెలియాలి. మనకు తెలియదు.

ఎవరికోసమైనా కబురు వెళ్లిన తర్వాత రాఘవేంద్రంగారు వాళ్ళని కలుసుకోడానికి మెల్లగా మధ్య గదిలోకి వస్తారు. గది అనడంకన్నా ఆ భాగాన్ని హాలనడం సమంజసం. ఆ హాల్లో నాలుగైదు కుర్చీలు, ఒక ఈజీచేర్, మధ్యలో ఒక పెద్ద టేబిలు యింత మాత్రమున్నాయి. రాఘవేంద్రం గారు టేబిలు కెదురుగా ఈజీచేర్ లో పడు




ఒకే రాణికి
కిరీట ధారణ
ఒకటేసారి



కాని...
ఓ అందాల రాణి! నీ వైతే, నీ నీలి కోమల దీర్ఘకేశాలతో రోజుకొక రీతిని అనుదినం మూర్ధాభిషిక్తురాలవుతున్నావు. శ్రీవిస్ - ఆమ్ల తైలము-అమూల్య మూలికలతో, అత్యుత్తమ వస్తు విశేషాలతో, సహజ కోమల పరిమళ మిళితమై, ఆయుర్వేద పద్ధతిని తయారు చేయబడిన అమోఘ కేశపోషక రాజము. అందాలరాణులు కోరదగిన అత్యుత్తమ అలంకరణ విశేషము.

**శ్రీవిస్ - ఆమ్ల**
హేరాయిల్



- తలవెండ్రుకలను పెంచునది.
- తలవెండ్రుకలు రాలుట ఆపునది.
- మెదడును తేలగించునది.
- మృదుత్వం కాంతి నిచ్చునది.
- చల్లదనం, హాయిని కలుగ జేయునది.
- కోమల పరిమళ మిళితమైనది.

తయారీ:
శ్రీవిస్-పర్ఫ్యూమరీ వర్క్స్, మదరాస్-1.

కుంటారు. టేబిలుపైన వుంచి కాలికో కిందులో ఒక పెద్ద పుస్తకం వుంటుంది. అది భగవద్గీత అని కొందరు చెబుతారు. రాఘవేంద్రంగారు ప్రతిరోజూ గీతా పారాయణం చేస్తారని కూడా ఒక లోక ప్రథ వుంది. ఈ మాటలోని నిజానిజాలు కూడా తెలియవు.

శేఖరం గుమ్మం దగ్గర నిలబడ్డాడు. వంగి ఓరకంటితో లోపలికి చూచాడు. రాఘవేంద్రంగారు ఈజీచేర్‌లో పడుకుని అర్ధనిమీలిత నేత్రులై చుట్ట కాల్చుకుంటున్నారు. మామూలు సమయాల్లోకన్నా చుట్ట కాలుస్తున్నప్పుడు, ఆయన్ని కలుసుకోడం శ్రేయస్కరమని శేఖరం యిదివరకు కలిగిన తన అనుభవాల వల్ల ఒక అంచనా వేసి దాన్ని అట్టే పెట్టి వుంచాడు.

ఒకడుగు లోపలికి వేస్తూనే, శేఖరం "నమస్కారమండీ" అంటూ చేతులు జోడించాడు శేఖరం రాకతో రాఘవేంద్రంగారిలో ఏ మాత్రం సంచలనమైనా కలిగిందని చెప్పడం కష్టం. ఆ అర్ధనిమీలిత నేత్రాలకు హాల్లో ముందరి భాగమంతా కనిపిస్తూ వుంది. బహుశా శేఖరం గూడా ఆయనకు కనిపించి వుండవచ్చు. అతడి మాటలు సైతం ఆయన వీనుల దాకా వెళ్ళివుండవచ్చు. కానీ ఆయనలో శేఖరాన్ని కన్నట్టు, అతడి మాటలు విన్నట్టు కించిత్తు మార్పయినా పొడచూపక పోవడం మాత్రం తథ్యం.

"తమరు పిలిపించారని పోస్టాఫీసుకు వెళ్ళబోతున్న వాణ్ణి తిరుగా యిక్కడికే వచ్చాను" అన్నాడు శేఖరం ఒక వారగా, వినమ్రంగా నిలబడి. శేఖరం ఎలిమెంటరీ స్కూలు ఉపాధ్యాయుడుగా ఆ వూరికి వచ్చాడు. వచ్చిన నాడు మ్రాళ్ళు ట్యూషన్లు చెప్పి, అడపాదడపా చావడిలో పనిచేసి, రాఘవేంద్రంగారికి ప్రీతిపాత్రుడయ్యాడు ఏ తత్ఫలితంగా అతడికి పోస్టుమాష్టరు గిరీ కూడా లభించింది. అందుకు శేఖరం రాఘవేంద్రంగారికి ఈ క్షణం వరకూ కృతజ్ఞుడు!

"నిలబడ్డారేం మాష్టరుగారూ! అలా కుర్చీలో కూచోండి" అన్నారు రాఘవేంద్రంగారు ఆఖరుకు నోరు తెరిచి.

శేఖరం వున్నపాటున వుక్కిరిబిక్కిరై పోయాడు. అయిపోదూ మరి! రాఘవేంద్రంగారి సన్నిధిలో తనకింతటి మర్యాద అపూర్వం!

"అబ్బే, ఎందుకులెండి" అని మెల్లగా తనలో తానే స్వగతంలా పలికాడు. శేఖరం.

"మరేం లేదు" అంటూ రాఘవేంద్రంగారు గొంతు సవరించుకున్నారు. "లేక లేక ఈ సంవత్సరం వేరుశెనగ వ్యాపారంలో దిగానా! పోదూ రెండు వేల మూటలు అమ్ముడుపోకుండా, స్టాకునిలిచిపోయాయి. ఆ స్టాకును కాస్తా అమ్మిపెడతారేమోనని..." రాఘవేంద్రంగారు లేచి నిటారుగా కూచుంటూ "మీకోసం కబురు పంపాను" అంటూ వాక్యం పూర్తిచేశారు.

శేఖరం నిర్ఘాంతపోయాడు. రాఘవేంద్రంగారు తనకు తెలిసి పదేళ్ళుగా వేరుశెనగ వ్యాపారంచేస్తున్నారు. ఆయన చేతి క్రింద నాలుగు ప్రాపెలరు పనిచేస్తున్నాయి ఎంతస్టాకయినా ఆయనకేచాలదు. రెండువేలమూటలేమిటి! స్టాకు నిలిచిపోవడమేమిటి! తను అమ్మిపెట్టడమేమిటి!

"నాకేం అర్థంకావడంలేదండీ" అంటూ శేఖరం అమాయికంగా, తెలతెలపోతూ విన్నవించుకున్నాడు.

"ఇప్పుడర్థంకాదులే! మీరువెళ్ళండి" అంటూ రాఘవేంద్రంగారు పైకిలేచారు. మందగమనంతో పడకగదిలోకి వెళ్ళిపోయారు.

* * *

కట్టగట్టుకుని రన్నరు వెళ్ళిపోయిన తర్వాత శేఖరం పొలాలపైన తిరిగీ తిరిగీ ఎనిమిది గంటలకు ఇల్లు చేరుకున్నాడు. "ఏమండీ! రాఘవేంద్రంగారు కనిపించారా" అంది పద్మ. తలాడిస్తూ శేఖరం మౌనంగా మంచంపైన కూలబడ్డాడు.

"అదేమండీ! అలా వున్నారు! ఆయనేమైనా నోరు పారేసుకున్నాడేమిటి?" అని మళ్ళీ ప్రశ్నించింది పద్మ.

"ఎవడైనా అసమర్థుడుంటే, వాడు నోరు పారేసుకుంటాడు. రాఘవేంద్రంగారెప్పుడూ నోరు పారేసుకోరు" అన్నాడు తీవ్రంగా శేఖరం. అనడమేమిటి, పద్మ ఏదో పెద్దపొరబాటుచేసినట్టు మందలించాడు శేఖరం!

"పోనీ, ఆయనేమన్నాడో చెబుదురూ!" అని ప్రతిమాలుకుంది పద్మ.

"ఏమంత పెద్దపని కాదనుకో! ఆయన దగ్గర రెండువేలమూటల వేరుశెనగ స్టాకు నిలిచిపోయిందట! దాన్ని కాస్తా అమ్మిపెట్టమంటున్నాడు."

"మిమ్మల్నా! మిమ్మల్నా" అంటూ విస్తుపోయింది పద్మ.

"నన్నే. నన్నే!" అని బిక్కమొగం వేశాడు శేఖరం.

అసలు విషయం తనకు తెలిసిపోయినట్టు, అసలే పెద్దవయిన తనకళ్ళను మరీ, పెద్దవి చేసి "అహా! అదా సంగతి!" అంటూ రాగం దీసింది పద్మ.

"అదే అదే! ఎలాగైనా నీ బుర్రే నయం పద్మా! అప్పుడే అనుకున్నాను ఈ రాద్ధాంతానికి కీలకమేమిటో కనిపెట్టే నువ్వే కనిపెట్టాలని! ఏదీ, ఏమిటో చెప్పు" అంటూ శేఖరం కొంచెం జరిగి కూచున్నాడు.

"ఏముందండీ మీరుమరీనూ! పోతేపోయిందని ఆ పదిమూటల కాయల్ని రాఘవేంద్రంగారి మండీకే తోలించివుంటే బాగుండేది. పదో, యిరవయ్యో కలిసొస్తుందని మరెవరికో బేరం చెప్పారు. పోనీ మీ బేరసారాలు గుట్టుగా వుంచారాఅంటే అదీ లేదు. మీతోబాటూ మరి నలుగురైదుగుర్ని కలుపుకుని మొత్తం ఒక లారీసరుకు బయటూరికి చేరవేయించారు. ఆ విషయం రాఘవేంద్రంగారికి తెలిసిందేమో!"


పేకలను
ఉత్పత్తి చేయుటలో ఇండియాలో పెద్ద సంస్థ


అందరిజేబులకు
సరిపోయే
పలు రకాలు



ఆకర్షణీయమైన
అనేకనమూనాల్లో
దొరకును

సాంపుల్సుకు వ్రాయండి!

**POPULAR FINE ART LITHO WORKS**
SURVODAY MILL COMPOUND, TARDEO, BOMBAY-7



సింహాచల దేవాలయంలో నరసింహావతార శిల్పం

ఫొటో: జి. సత్యనారాయణ.

జ్ఞానోదయమైన తపస్విలా శేఖరం లేచి నిల్చున్నాడు రెండుమూడు క్షణాలపాటు అలా బ్రమ్మపడిపోయి తరువాత మెల్లగా పచార్లు చేయసాగాడు.

గ్రామానికి చుట్టుపట్ల నాలుగైదుమైళ్ల వరకూ మరొక బేరగాడు వచ్చి సరుకు కొనుగోలు చేయకూడదని రాఘవేంద్రంగారు మొదటినుంచీ ఒక ఆనవాయితీ అమల్లో వుంచారు అథవా ఎవడైనా బేరానికి వచ్చినా వాడికి సరుకివ్వకూడదు అలా ఐతే ఆ తరువాత అతడున్నాడు, రాఘవేంద్రంగారున్నారు. ఇంతకూ తన మాట మీరినవాణ్ణి రాఘవేంద్రంగారు దూషించినట్టుగానీ, పరాభవించినట్టుగానీ నిదర్శనాలు లేవు ఆయన ఊహ అని మనసులో అనుకుంటాడు! అంతే! కొంగల కార్యాన్ని గంధర్వులే తీరుస్తారు!

పదిపదిహేను నిమిషాల ఆలోచన తర్వాత శేఖరం ఓ నిర్ణయానికి వచ్చాడు అంతగా తనను సాధింపదలచుకుంటే రాఘవేంద్రంగారేం చేయగలరు? తనవా ఊళ్ళోనుంచి మార్పించ గలరు పోనీ! తనకేం యిదే ఊరని వ్రాసిపెట్టలేదు రాముడున్నాడు రాజ్యముంది ట్రాన్స్ఫరు ఆర్డరు వస్తే దట్ మోహాపరంగా అని తను పెట్టె బేడా సర్దుకుంటాడు అంతేమరి! కానున్నది కాకమానదు కదా!

# ★ విగ్రహానుగ్రహాలు ★

అంతే అయింది! రాఘవేంద్రం గారితో పేచీ అయి వారంరోజులు తిరక్కుముందే శేఖరానికి ట్రాన్స్ఫరు ఆర్డరు చేతికందింది.

"నువ్వు ఫలానా వూరికి మార్చబడ్డావు! ఫలానా వాడు అవూరినుంచీ వస్తాడు. అతడికి చార్జీ ఒప్పగించి నువ్వు వారంరోజుల్లో సదరు ఫలానా వూరిలో వుద్యోగంలో చేరవలసింది." అంటోంది వుత్తరువు.

సామానులన్నిటిని పాక్ చేయించి రైల్లోవాటిని భార్యా బిడ్డలతో సహా స్వంత వూరికి పంపించి రాబోతున్న ఆ ఫలానా వారికోసం ఎదురు తెన్నులు చూస్తూ కూచున్నాడు శేఖరం.

నాలుగోరోజున క్రొత్త టీచరు వూళ్లోకి విజయం చేశాడు. వచ్చినవాడు ఒక్క రోజంతా శేఖరం స్వయం పాకంలో భాగాలు పంచుకుని తిన్న శాస్త్రిలు ముగించి, వూళ్లో చాలామందితో భాగాలు పరిచయం కుదుర్చుకుని, ఆ సాయంత్రం రాఘవేంద్రంగారిని దర్శించి ఆ మరునాడు వుద్యోగం చార్జీ పుచ్చుకున్నాడు.

"ఇప్పటి కొకటయింది. ఇక పోస్టాఫీసొకటుంది. ఆ పనికూడా మీకే అప్పగించవలసివుంటుందని పైవాళ్ల నడిగి కనుక్కున్నాను" అన్నాడు శేఖరం.

"పోస్టాఫీసా! అబ్బే! నాకక్కరలేదండీ" అంటూ నాలుక చప్పరించేశాడు క్రొత్త టీచరు వెంకటేశం.

"అదేమిటండీ! ఇది ఏకోపాధ్యాయ పాఠశాలని తెలుసు గదా మీకు! ఇక్కడ ఎవరైతే టీచరుగా వుంటాడో అతడే పోస్టాఫీసుకూడా చూచుకోడం పరిపాటి. ఊరికే ధర్మానికి కాదు గదా! ఇరవై రూపాయలంటే మరేం చేదుకాదు గదా మనకు!" అన్నాడు శేఖరం.

వెంకటేశం శేఖరాన్ని తన గదిలోకి తీసుకెళ్లి రహస్యమని మరిమరీ చెప్పి చేతిలో చేయి వేయించుకుని "నన్నేం చేయమంటారు శేఖరం గారూ! సిరివస్తే మోకాలడ్డవలసిన దౌర్భాగ్యున్నయిపోయాను. రాఘవేంద్రంగారొక్కటే మాటచెప్పారు తనమాట లెందే మీ దగ్గరనుంచీ పోస్టాఫీసు చార్జీ పుచ్చుకోవద్దన్నారు. అందుకని ఇలా గవలసి వచ్చింది" అని నచ్చజెప్పుకున్నాడు.

శేఖరానికి ఒళ్లు మండింది. పై అధికారులకు సైతం తలవంచని ఆత్మాభిమానం విద్యుల్లతలా అతని శరీరంలో సుళ్లు తిరిగింది. "అంతా మన మేలువకే వెంకటేశం గారూ! జరిగేదంతా జరగనివ్వండి" అంటూ అతడు మెల్లగా పదేళ్లు తన జవసత్వాలు హరించివేసిన స్కూల్లోనుంచి బయటికి వచ్చేశాడు.

ఆ రాత్రంతా శేఖరం నిద్ర పోకుండా ఆలోచించాడు. నిజానికి యిప్పుడు తనేం పొరబాటు చేశాడు? ఎవరో దయతలచి తమ కందుబాటులో లేని పొలాన్ని వీలైతే తనని సాగుచేసుకో మన్నారు. ఆ మెరక పొలాన్ని దున్నించి విత్తనాలు వేయించి పైరు పెట్టాడు. పైరు ఫలితానికి వచ్చినప్పుడు అడివి మేకాలు తినిపోకుండా రాత్రిపూట కాపుదారీ పెట్టించాడు. ఇంత జేసీ అబ్బరంగా తను పదిమూటల కాయలు పండించుకుంటే దానివల్ల అర్థాంతరంగా యింతవ్యవహారంవచ్చిపడింది. పండించుకునే వారికి తనపంటను వీలయినంత గిట్టుబాటుకు


చల్లనైన, తెల్లని

బ్రిల్‌క్రీమ్ BRYLCREEM

బ్రిల్‌క్రీమ్ వాడి మీ కేశములను ఎక్కువ నిగనిగలాడుచు నలుపుగా ఉంచుకొనండి

★ బ్రిల్‌క్రీమ్‌లోనున్న పరిశుభ్రమైన పేరుకున్న నూనెలు మీ కేశముల సహజ నల్లదనమును, తళతళ మెరుస్తు కనపడేలాగ చేయును.
★ శుభ్రమైన, తెల్లని బ్రిల్‌క్రీమును ప్రతిరోజు మీ శిరస్సునకు వాడండి. ఇది చుండ్రు రాకుండా మీ కేశములను శుభ్రముగ మరియు ఆరోగ్యకరముగా నుంచును.
★ బ్రిల్‌క్రీమ్ కొద్దిగా రాచుకుంటేనే చాలును! అందువలన పొదుపు చేకూరును. నేడే ఒక సీసాను కొని మీరు మీరే నిర్ధారణ పరచుకొండి.




ఇతర ఉన్నతి పొందిన వారివలె వినూ మన్‌కడ్ కూడ బ్రిల్‌క్రీమ్ వాడును




ఇహా ఉన్నతి పొందిన వారు వాడేది
బ్రిల్‌క్రీమ్

BRL. 2968 (Tel.)



"మేఘైర్మేదురమంబరం..."

ఫోటో: జి. ఎస్. శర్మ

అమ్మకు నే హాక్కుంది తను చేసిందంతే! ఏవిధంగా ఆలోచించినా తను దోషికాడు రాఘవేంద్రంగారి ఎదుట అపరాధిగా నిలబడ వలసిన అవసరం తనకి లేదు!

మరునాటి వుదయం శేఖరం బస్సెక్కి తను బదిలీ అయిన వూరికి వెళ్ళి ఛార్జీ పుచ్చుకుని పుచ్చుకున్న మరుగంటలో నే మూడు నెలల ప్రివిలేజి లీవుకు అప్లైచేసి తిరిగి వచ్చాడు.

ఆ రాత్రి సైతం శేఖరానికి నిద్రపట్ట లేదు తెలతేరకు మూడు నెలల ప్రివిలేజి లీవు వృథా కాబోతున్నది కాజువల్ లీవు యింతకు మునుపే ఖర్చయిపోయింది ఈ మూడు నెలలు గడచిన తర్వాత తన కేదైనా రోగం ముంచుకువస్తే తప్ప సెలవు దొరకదు. అవతల చెల్లెళ్ళకూ, తమ్ముళ్ళకూ పెళ్ళిళ్ళనీ, పబ్బాలనీ బోలెడుపనులున్నాయి అవి తను లేకపోతే జరుగవు. బాహ్య పరిస్థితుల కత్తులబోనులో తన్నుకలాడుతున్న తనకు ఈ మూడు నెలలు గడిచే లోపుగా చిత్తభ్రమే కలిగిపోతుందేమో!

శేఖరం ఆ ఆవేదనలో రెండు పేపర్లు ఫైల్లోనుంచి లాగి పైవాళ్ళకు విన్నపం వ్రాసుకున్నాడు ఈ పోస్టాఫీసు బాధ్యతని స్వీకరించడానికి ఈవూళ్ళో ఎవరూ ముందుకు రావడంలేదు కారణం అనూహ్యంగావుంది. తను బిడ్డలు గలవాడు! వీలైనంత త్వరగా ఈ



ఈ ఆదర్శమైన క్రీమ్ వాడి
అందముగ కనపడండి

ఇది మీ చర్మమును మృదువుగా, అందముగా ఉండేలా చేయును
...లోపములను కనబడనీయక నిష్కళంకముగ ఉంచును

కల్లని, మంచువలెనున్న పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్ వాడి మీరు ఎల్లప్పుడూ మనోహరముగ ఉండండి.

పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్ రోజూ ఉదయము పైపైన రాసుకోండి. కొన్ని సెకండ్లలోనే అది మాయమవుతుంది... కాని అది ఆశ్చర్యకరముగ చర్మమును నిష్కళంకముగా చేస్తుంది! మీ ముఖము ఎంతో సహజముగ మృదువుగా ఉండుట మీరు చూస్తారు.

ముఖముమీద పౌడరు అంటుకుని ఉంటుంది!

మీరు పౌడరు రాసుకునేటప్పుడు లేక మేకప్ చేసుకునే ముందు ప్రతి సారి కొద్దిగా పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్ పైపైన రాసుకోండి. అది మీ చర్మమును ఏకరీతిగా మృదువుగా చేస్తుంది. రోజంతా మనోహరముగ ఉండుటకు మంచువలెనున్న పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్ వాడండి!




పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్

# నిగ్రహానుగ్రహాలు

బాదరబందినుంచి తనకు విముక్తి కలిగించితే ఆ జన్మాంతం కృతజ్ఞుడుగా వుండగలడు!

విన్నపానికి మూడోరోజున ప్రత్యుత్తరం వచ్చింది. "పోస్టాఫీసును బాధ్యతగల వ్యక్తికి ఒప్పగించడం నీ బాధ్యత! అంతవరకూ ఏ పరిస్థితుల్లోగానీ నీ రాజీనామా అంగీకరింపబడదు. ఈ వుత్తరువును మీరితే నీవు చట్టప్రకారం సివిల్, క్రిమినల్ చర్యలకి బాధ్యుడివి!"

శేఖరం కింకర్తవ్యం తోచక పిచ్చివాడిలా జుట్టు పీకేసుకున్నాడు!

రోజులు మెల్లగా దొర్లిపోతున్నాయి. బిడ్డలు తనకోసం కలవరిస్తున్నారని, తప్పకుండా ఒకసారి వచ్చిపోవలసిందనీ పద్మ జాబు వ్రాసింది. "వీల్లేదు. ఇప్పుడు నేను వివరంగా జాబు వ్రాసే స్థితిలోకూడా లేను" అని శేఖరం బదులు వ్రాశాడు.

మూడో నెల పూర్తి కావడానికిక వారం రోజులున్నాయనగా తనకు మరొక రెండు నెలలపాటు సెలవు పొడిగించవలసిందని శేఖరం జిల్లాబోర్డుకు మనవి పంపుకున్నాడు.

"ప్రివిలేజిలీవు పూర్తిగా వినియోగించుకోబడినందువల్ల నీకోరిక నిరాకరింపబడింది. నువ్వు తక్షణం వుద్యోగంలో చేరవలసింది. లేకపోతే నీ సర్వీసు యింతటితో 'బ్రేక్' అయిపోవడానికి అవకాశం వుంది." అని జిల్లాబోర్డు శేఖరం పైకి చక్రాయుధం వదిలింది!

వెంటబడి తరుముతున్న చక్రాయుధం బారినుంచి తప్పించుకోడానికి శేఖరం జిల్లా ముఖ్యపట్టణానికి పరుగులు తీశాడు. ఇటు విద్యాశాఖాధికారుల్నీ, అటు తపాలాశాఖ వాళ్లనీ కలుసుకుని తననీ విషమ, విపత్కర పరిస్థితిలో నుంచి తప్పించకపోతే వీల్లేదని మొరపెట్టుకున్నాడు.

అధికారుల్లో కొందరు తామసులు. వాళ్ల కళ్ళకు లోకమంతా దోష భూయిష్ఠంగా కన్పిస్తుంది. వాళ్లు శేఖరాన్ని తూలనాడి అవతలకి పొమ్మన్నారు. మరికొందరు రాజసగుణం నరనరాల ఒంటబట్టినవాళ్లు. అతడికి వచ్చింది ఒక కష్టమే కానట్లు, శేఖరం మాటలు విని విననట్లు వూరుకున్నారు సాత్వికులు కొందరేమో అతణ్ణి దగ్గరకు చేరదీసి "ఏనా ఈడొంక తిరుగుళ్లెందుకు నాయనా? కేలెరిగిగదా వాత వేయాలి! కీ లెక్కడుందో తెలియక యింత దూరం పరుగెత్తివచ్చావు పాపం! వెళు రాఘవేంద్రంగారు మంచివారు. ఏమైనా చేస్తే ఆయనే చేయాలి. మనవల్ల నేమౌతుంది? వెళ్ళుబాబూ వెళ్ళు" అని ప్రబోధించి శేఖరానికి తిరుగుదారి చూపించారు.

ఆ పాటికి శేఖరం మనసు మొద్దుబారిపోయింది. ఆత్మాభిమానం తనలోనుంచీ పైనొలగిపోగా అతడు నిర్వికార, నిర్గుణ, నిరంజన స్వరూపుడై మిగిలిపోయాడు!

ఊళ్ళో బస్సుదిగగానే శేఖరం తలవంచుకుని వేగంగా వీధివెంబడే నడిచాడు. ఇనుపకమ్ముల గేటు ఒత్తిగించుకున్నాడు. కచేరీ చావడి దాటాడు. పందిరికిందకు వచ్చాడు.

శేఖరం అదృష్టం మంచిది! రాఘవేంద్రం గారు పందిరిక్రింద పచారుచేస్తూ కనిపించారు.

శేఖరం దగ్గరికి పోయాడు. నమస్కారం చేశాడు. తను అయిదుగురు బిడ్డల తండ్రినన్న విషయం విన్నవించుకొన్నాడు. తను అపరాధం చేసిన మాట నిజమేనన్నాడు. బిడ్డలు తప్పుచేస్తే పెద్దలు గాక మరెవరు క్షమిస్తారని సవినయంగా ప్రశ్నించాడు. అయినా తను చేసిన తప్పుకు శిక్ష అనుభవించడం జరిగిపోయింది గనుక తననింకనైనా మన్నించవచ్చునని మనవి చేసుకున్నాడు.

అంతావిని రాఘవేంద్రం గారు నౌఖరును పిలిచి "క్రొత్త టీచరును యిక్కడికి వచ్చి పొమ్మను" అని కబురుపంపారు.

పదినిమిషాల్లో వేంకటేశం రాఘవేంద్రం గారి సముఖాన హాజరయ్యారు

రాఘవేంద్రం గారు వేంకటేశం వైపొకసారి చూచి "పోస్టాఫీసుఛార్జీ ఒప్పగించుకోండి" అన్నారు.

వేంకటేశం చేతులు నులుముకుంటూ "నాకు పోస్టాఫీసు వద్దండి" అన్నాడు

"ఏం! ఎందుకూ?" అన్నారు రాఘవేంద్రం గారు.

"మరేంలేదండీ! మూడు నెలలనుంచీ శేఖరంగారి అవస్థ చూస్తున్నాను. నాకెప్పుడైనా మార్పువస్తే, మళ్ళీ యిదే చిక్కు నాకూ దాపురించవచ్చునని భయంగా వుంది. అదీగాక నాకీవూరినీళ్ళు సరిపడ్డంలేదు. అంచేత యిక్కడినుంచీ మార్పించుకోవాలని" అంటూ నీళ్ళు నమిలాడు వేంకటేశం.

రాఘవేంద్రం గారు శేఖరం వెపు తిరిగి "నాలుగు రోజులు నిదానించండి. అందాకా మీరిక్కడే భోంచేయవచ్చు. వంటవాడితో నేను చెప్పానని చెప్పండి" అంటూ చరచరా ఏకాంత గృహంలోకి వెళ్ళిపోయాడు.

నిర్ఘాంతపడి ఎటు వెళ్ళడానికీ తోచక పందిరి క్రిందే నిలిచిపోయిన శేఖరం రాఘవేంద్రం గారి గదిలో టెలిఫోను మ్రోగడం విని మళ్ళీ ఈలోకంలో పడి మెల్లగా బయటికి దారితీశాడు.

కథాంతంలో ఒకటి రెండు మాటలు: వేంకటేశానికి అయిదోరోజున ట్రాన్స్ఫరు ఆర్డరు వచ్చింది. అతడి స్థానే శేఖరం నియమింపబడ్డాడు. ఏండ్లు గడచిపోతున్నాయి. తనకావూరు అచ్చివచ్చిందనీ, తన సర్వీసంతా అక్కడే గడచిపోయినా మంచిదేనని శేఖరం చెప్పుకుంటాడు. లోలోపల తనకావూరి నుంచి మార్పు రాదని కూడా అతడి దృఢనమ్మకం! నిజమే మార్పురాదు. ఎందుకొస్తుంది! ★




# 'అనాసిన్' లోని నాలుగు మందులతో

## మీ బాధా విముక్తిని పొందండి

'అనాసిన్' నాలుగు మందులయొక్క వైజ్ఞానిక మిశ్రమము ఇది వరముల ముఖ్యతావములందు తీవ్రమైన మిశ్రమచర్యను జరిపి, నొప్పి, తలనొప్పి, జలుబు, జ్వరంవచ్చునొప్పి మరియు కండరాల నొప్పులనుండి శీఘ్రవిముక్తి కలిగించును.

**అనాసిన్‌లో ఇవి ఉన్నవి**

1. క్వినైన్: అధికశక్తినిచ్చు మరియు జ్వరనివారణ మొదలగు గుణాలకు ప్రఖ్యాతి గాంచినది. జ్వరాన్ని తగ్గించడంలో మిక్కిలి శక్తిగలది.
2. కెఫీన్: బలహీనానికి మరియు చిక్కిపోయినందులకు తగిన ఔషధమని విరివిగా వాడబడుచున్నది.
3. ఫినాసిటిన్: తీవ్రమైన బాధా నివారిణి జ్వరనివారిణి యని ఖ్యాతిచెందినది.
4. ఎసిటైల్ సాలిసిలిక్ ఏసిడ్: తలనొప్పి మరియు అలాంటి బాధలను పోగొట్టుటకు ఉపయుక్తమైనది.

ఈ నాలుగు మందులు ఎరిగ్గా వైద్యునియొక్క ఔషధయోగము వలె పనిచేయును 'అనాసిన్' గుండెకు హాని కలిగించదు కడుపును అవకతవక చేయదు. నొప్పి, తలనొప్పి జలుబు పన్ను నొప్పి మరియు కండరాల నొప్పులనుండి శీఘ్రముగా సురక్షితమైన మరియు దీర్ఘమైన విముక్తి కొరకు ఎల్లప్పుడూ 'అనాసిన్'నే వాడండి.




లక్షలాది మందికి బాధావిముక్తిని కలిగించును